

పోటెత్తిన భక్తులు

వేములవాడ: రాజన్నను గురువారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, ప్రతాప నవీన్ పరిశీలించారు.



కలశాభిషేకం..

కరీంనగర్ కల్చరల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీవారికి, అమ్మవార్లకు సహస్ర కలశాభిషేకం నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం

31.0/14.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలి'

జగిత్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గణతంత్ర వేడుకల్లో సీఎం కేసీఆర్ పాల్గొనకపోవడం రాజ్యాంగాన్ని అగౌరవపరచడమేనని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. కీలక పదవిలో ఉన్న సీఎం కేసీఆర్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనకపోవడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్ర ఏర్పాటుకు మూలమైన రాజ్యాంగ దినోత్సవానికి సీఎం కేసీఆర్ ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించని సీఎం కేసీఆర్‌కు పదవిలో కొనసాగే హక్కు లేదన్నారు. సీఎం కేసీఆర్ జరిగిన పొరపాటును గ్రహించి గవర్నర్‌కు క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

సెలవుల రద్దు ఉపసంహరించుకోవాలి

జగిత్యాల: ప్రస్తుతం చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు అవసరమైనప్పుడు స్కూల్ వదిలి రావాల్సి వచ్చే ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు డీఈవోకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కొందరు ప్రధానోపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు రావడానికి పర్మిషన్ అడిగితే సెలవు మంజూరు చేయరాదని, ఆన్‌డ్యూటీ ఇవ్వరాదని తెలుపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సెలవులు వినియోగించుకోవద్దని, సెలవులు మంజూరు చేయవద్దనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి స్వామియాదవ్, ఖదీర్, స్వామి, భరత్ పాల్గొన్నారు.

కాలభైరవ ఆలయానికి భూమిపూజ



ధర్మపురి:ధర్మపురిలో కాలభైరవ ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ సత్యవతి ఆలయంలోని ఇసుకస్తంభం సమీపంలో కాలభైరవ ఆలయ నిర్మాణానికి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇందారపు రామన్న ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ధర్మపురికి చెందిన గోలి పూర్ణచందర్–శ్రీలత దంపతులు ఆలయ నిర్మాణానికి రూ.4లక్షలు విరాళం అందిస్తున్నారు. ఈవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, రాజేశ్, విజయలక్ష్మి ఉన్నారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



కార్యక్రమానికి హాజరైన జిల్లా ప్రముఖులు





ప్రసంగిస్తున్న కలెక్టర్ రవి

జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి. చిత్రంలో ఎస్పీ సింధూశర్మ

అన్ని రంగాల్లో అగ్రపథం

- వైద్యానికి పెద్దపీట.. తీరిన నీటి సమస్య
- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రవి
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రశంసా పత్రాలు అందుకున్న పలువురు జిల్లావాసులు

జగిత్యాల/జగిత్యాలటౌన్/జగిత్యాలక్రైం/జగిత్యాలజోన్: జగిత్యాల జిల్లా అన్నిరంగాల్లో అగ్రపథంలో కొనసాగుతూ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోందని కలెక్టర్ రవి అన్నారు. గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలను సమీకృత కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అద్భుతంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈసారి జిల్లాలో రైతులు 3,69,109 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగుచేశారని అన్నారు. మన ఊరు– మనబడి, మనబస్తీ, మనబడి కార్యక్రమం ద్వారా జిల్లాలో 274 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. జిల్లా పరిధిలోని ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ కింద 1,68,255 ఎకరాల ఆయకట్టు సాగవుతోందని, మిషన్ కాకతీయ ద్వారా ఇప్పటి వరకు రూ.67.30కోట్లతో 265 చెరువులు సుందరీకరించినట్లు వివరించారు. మిషన్ భగీరథ ద్వారా రూ.1,750కోట్లు వెచ్చించి

అభివృద్ధిలో జిల్లా ఆదర్శం

రక్షిత తాగునీరు అందించడం జరుగుతోందని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా గతేడాది 7,800 మంది లబ్ధిదారులకు రూ.80.03 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఆసరా ద్వారా 2,28,999 మందికి ప్రతినెల రూ.47.91 కోట్లు పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద ఈ ఆర్థిక సంవత్సరంలో 7812 సంఘాలకు రూ.507కోట్ల రుణాలు అందించడం జరిగిందన్నారు. స్త్రీనిధి ద్వారా 54.74 కోట్ల రుణాలు సైతం ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 25,63,599 ఉపాధి పనిదినాలు కల్పించి పరిపాలన ఖర్చుల కోసం రూ.79.08 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. 661 నాయీబ్రాహ్మణ, 1,628 రజక యూనిట్లకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జగిత్యాలలో రూ.475కోట్లతో 8,770 డబుల్‌బెడ్‌రూమ్‌లు మంజూరు కాగా 2,370 ఇళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 33,587 మంది మహిళలకు కేసీఆర్ కిట్లు, రూ.5.05కోట్ల ఆర్థికసాయం అందించడం జరిగిందని అన్నారు. కోరుట్లలో 100పడకల ఆస్పత్రి, మెట్‌పల్లిలో నూతనంగా 30 పడకల ఆస్పత్రిని నిర్మించడం జరుగుతోందని అన్నారు. ఆరోగ్య లక్ష్మి పథకం కింద 14,642 మంది గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ భోజనం, గుడ్లు, పాలు, భోజనం అందించడం జరిగిందన్నారు. దళితబంధు పథకం కింద జిల్లాలో 300 మందికి రూ.34.15 కోట్లు మంజూరు చేయగా యూనిట్లు అన్ని గ్రౌండింగ్ అయ్యాయన్నారు.

సాగు సంబురం.. చదువుకు ప్రాముఖ్యత



అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల చిన్నారులు ఆటపాటలతో అలరించారు. చిన్నారులను జిల్లా కలెక్టర్ రవి, అదనపు కలెక్టర్లు లత, మకరంద, ఎస్పీ సింధూశర్మ అభినందించి బహుమతులు అందజేశారు. పలురంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి వీరయ్య, అడిషనల్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా కోర్టులో రిపబ్లిక్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. మొదటి అదనపు జిల్లా జడ్జి వీరయ్య జెండా ఆవిష్కరించారు.
- బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు ముద్దం ప్రభాకర్, వ్యవసాయ పరిశోధనస్థానంలో డైరెక్టర్ శ్రీనివాస్, జగిత్యాల స్పెషల్ సబ్‌జైలులో మొగిలేశ్, జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, వ్యవసాయ మార్కెట్‌కమిటిలో చైర్‌పర్సన్ నక్కల రాధ జెండా ఎగురవేశారు.
- ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ సింధూశర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

డీఎస్పీ ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, రవీందర్‌కుమార్, ఆర్‌ఐ వామనమూరిత నవీన్, సీఐలు కిశోర్, కృష్ణకుమార్, రమణమూర్తి, కోటేశ్వర్ పాల్గొన్నారు.

- జిల్లా అటవీశాఖ కార్యాలయంలో అటవీఅధికారి వెంకటేశ్వర్‌రావు, రేంజ్ కార్యాలయంలో రేంజర్ ప్రణీత్‌కౌర్ జాతీయ జెండా ఆవిష్కరించారు.
- పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయంలో డీపీవో నరేశ్, జిల్లా ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో సీఐ ప్రభాకర్‌రెడ్డి, జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి శివారులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో డీటీవో శ్యామ్‌నాయక్, తదితరులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ కిశోర్, రూరల్‌సీఐ కార్యాలయంలో సీఐ కృష్ణకుమార్, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై అనిల్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎల్.రాము జెండా ఆవిష్కరణ చేశారు.
- మార్కెట్‌యార్డులోని దడ్వాయి కార్మికులు, అడ్తి ఖరీదుదారులు ఏర్పాటు చేసిన జెండాను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ సత్యనారాయణ జెండా ఎగురవేశారు.
- అదనపు కలెక్టర బీఎస్ లత తన క్యాంపు కార్యాలయంలో జెండా ఎగురవేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంజయ్‌కుమార్, ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.



బహుమతులు అందిస్తున్న జడ్జి వీరయ్య



జెండావందనం చేస్తున్న ఎస్పీ సింధూశర్మ



జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ఎమ్మెల్యే సంజయ్ కుమార్

బదిలీల కాలం

- ఉమ్మడి జిల్లాలో ఐపీఎస్‌ల స్థానచలనం
- త్వరలో భారీగా ఐఏఎస్‌ల ట్రాన్స్‌ఫర్లు
- ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బదిలీలు
- జాబితాలో కరీంనగర్ కలెక్టర్ దంపతులూ
- బదిలీపై ముందే వెల్లడించిన 'సాక్షి' కథనం



ఇన్

ఎల్.సుబ్బారాయుడు



అవుట్

సత్యనారాయణ



ఇన్

రెమా రాజేశ్వరి



అవుట్

చంద్రశేఖర్‌రెడ్డి



ఇన్

అఖిల్ మహాజన్



అవుట్

రాహుల్ హెగ్డే



ఇన్

భాస్కర్



అవుట్

సింధూశర్మ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు సమయాత్తమవుతోంది. ఈ ఏడాది అంతానికి ప్రభుత్వ కాలపరిమితి ముగుస్తున్న దరిమిలా.. ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కీలకమైన పరిపాలన, శాంతిభద్రతలు, రెవెన్యూ అధికారుల బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి.. స్పష్టంగా చెప్పాలంటే గురువారం తెల్లవారుజామున జరిగిన ఐపీఎస్‌ల బదిలీలు ఉత్కంఠకు తెరదించాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో సమర్థులైన అధికారులను నియమించాలన్న ఆలోచనను ప్రభుత్వం ఇప్పుడే అమల్లో పెట్టింది. ఇదే క్రమంలో రెండుమూడు రోజుల్లో భారీగా ఐఏఎస్‌ల బదిలీల్లోనూ ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అధికారులు బదిలీ అవుతారని ప్రచారం సాగుతోంది.

కొత్త బాసుల వివరాలు ఇవే..!

కరీంనగర్ సీపీ: సుబ్బారాయుడు

గతంలో కరీంనగర్‌లో ఓఎస్డీగా పనిచేసిన అనుభవం ఉంది. అడ్మినిస్ట్రేషన్, నేర పరిశోధనలో మంచి ఆఫీసర్‌గా గుర్తింపు ఉంది. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేసిన నరసింహన్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేశారు.రాష్ట్ర విభజన అనంతరం ఏపీ సీఎం చంద్రబాబు వద్ద సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేశారు. ఇటీవల ఐపీఎస్‌ల విభజనలో తెలంగాణకు వచ్చారు. నాన్ కేడర్ ఎస్పీగా ఉన్న సమయంలో 2021 డిసెంబరులో ఐపీఎస్‌గా పదోన్నతి పొందారు. అప్పటి నుంచి డీజీపీ కార్యాలయంలో సీఐడీ విభాగంలో ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. తాజా బదిలీతో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ స్థానంలో ఉన్న డీఐజీ సత్యనారాయణ రాచకొండ జాయింట్ కమిషనర్‌గా వెళ్లనున్నారు.

రెమా రాజేశ్వరి: డీఐజీ, రామగుండం సీపీ

ప్రస్తుతం నల్లగొండ ఎస్పీగా ఉన్న రెమా రాజేశ్వరి కేరళలోని మున్నార్‌లో జన్మించారు. 2009 ఐపీఎస్ బ్యాచ్ టాపర్. విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటారు. ఐపీఎస్‌ల విభజన సమయంలో తెలంగాణ ఆప్షన్ ఇచ్చుకున్నారు. టెక్నాలజీ, న్యాయశాస్త్రంపై పట్టున్న అధికారి. క్షేత్రస్థాయిలో ఇన్ఫర్మేషన్ సేకరించడంలో దిట్ట. 2016లో షాద్‌నగర్‌లో గ్యాంగ్‌స్టర్ నయీం ఎన్‌కౌంటర్ సమయంలో ఆమె మహబూబ్‌నగర్ ఎస్పీగా ఉండటం గమనార్హం. సోషల్ మీడియా ఫేక్‌న్యూస్ కట్టడిలో అందెవేసిన చేయి. కోవిడ్ సమయంలోనూ డీజీపీ ఆఫీసు ఆదేశాల మేరకు టీఎస్ఎస్‌పీ బెటాలియన్ నుంచి పలు స్పెషల్ ఆపరేషన్లను పర్యవేక్షించారు. 2021 డిసెంబరులో నల్లగొండ ఎస్పీగా నియమితులయ్యారు. గంజాయి రవాణాదారులపై ఉక్కుపాదం మోపారు. త్వరలో రామగుండం సీపీగా బాధ్యతలు తీసుకుంటారు. అంతకుముందు ఆ స్థానంలో ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి ఐజీగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే.

అఖిల్ మహాజన్, ఐపీఎస్: సిరిసిల్ల ఎస్పీ

2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అఖిల్ మహాజన్ స్వస్థలం జమ్మూ–కశ్మీర్. హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ చదివారు. సర్దార్‌వల్లభ్ భాయ్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్వీఎన్‌పీసీ)లో ఐపీఎస్ శిక్షణ పొందారు. కోవిడ్ తొలివేవ్ సమయంలో 2020లో రామగుండం కమిషనరేట్‌లో ట్రైనీ ఐపీఎస్‌గా చేరారు. ఆ తరువాత కమిషనరేట్ అడ్మిన్‌గా, మంచిర్యాల డీసీపీగా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా జరిగిన బదిలీల్లో సిరిసిల్ల ఎస్పీగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. (ఆ స్థానంలో ఉన్న రాహుల్ హెగ్డే హైదరాబాద్ ట్రాఫిక్‌కి బదిలీ అయ్యారు) కోల్‌బెల్ట్ ప్రాంతంలో సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. నేర పరిశోధన, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, గంజాయి రవాణా నిర్మూలన, భూ కబ్జాదారులకు కళ్లెం వేయడంలో అఖిల్‌కు ఈ ప్రాంతంలో మంచి మార్కులు పడ్డాయి.

భాస్కర్: జగిత్యాల ఎస్పీ

హైదరాబాద్‌లో ఇంటలిజెన్స్ విభాగంలో ఎస్పీగా ఉన్న భాస్కర్‌ను ప్రభుత్వం జగిత్యాల ఎస్పీగా బదిలీ చేసింది. సూర్యాపేట జిల్లాకు చెందిన భాస్కర్ 2010 గ్రూప్–1 అధికారి. తొలి పోస్టింగ్ ఉమ్మడి రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో, రెండో పోస్టింగ్ కామారెడ్డి డీఎస్పీగా, మూడో పోస్టింగ్ ఆసిఫాబాద్ డీఎస్పీగా, నాల్గో పోస్టింగ్ మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీగా, ఇంటలిజెన్సీ ఎస్పీగా పనిచేశారు. ప్రస్తుత బదిలీల్లో జగిత్యాల జిల్లాకు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఉన్న సింధూశర్మను ప్రభుత్వం వరంగల్‌లోని టీఎస్ఎస్‌పీ మామూనురు క్యాంపునకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

త్వరలో ఐఏఎస్‌ల బదిలీలు..!

- అదే సమయంలో కరీంనగర్‌లో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జెడ్పీ సీఈవో ప్రియాంక, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌లకు పదోన్నతి మీద హైదరాబాద్‌కు వెళ్లనున్నారని సమాచారం. జెడ్పీ సీఈవోకు త్వరలోనే ఐఏఎస్ హోదా రానున్న విషయం తెలిసిందే. అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్, ఆర్డీవో ఆనంద్ బదిలీ కానున్నారని తెలిసింది.
- సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ కాస్త అటూఇటూగా ఏడాదిలోపే విధుల్లో చేరారు. ఆర్డీవో శ్రీనివాస్ మాత్రం మూడేళ్ల కింద వచ్చారు.
- జగిత్యాల కలెక్టర్ గుగులోత్ రవి బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. అలాగే ఆర్డీవో మాధురి స్థానచలనం తప్పేలా లేదు.
- పెద్దపల్లి అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు బదిలీ అవకాశాలు ఉన్నాయి. డీసీపీ (అడ్మిన్) అఖిలేశ్, పెద్దపల్లి ఇన్‌ఛార్జి రూపేశ్ స్థానంలో సుధీర్ కేకన్, గైక్వాడ్ వైభవ్ వచ్చిన విషయం తెలిసిందే.

బదిలీలపై ముందే చెప్పిన సాక్షి..!

ఉమ్మడి జిల్లాలో లాంగ్‌స్టాండింగ్‌గా ఉన్న ఐపీఎస్ అధికారులు సిరిసిల్ల రాహుల్‌హెగ్డే, జగిత్యాల ఎస్పీ సింధూశర్మ బదిలీ అవుతారని, కరీంనగర్ సీపీ సత్యనారాయణ సైతం ట్రాన్స్‌ఫర్ అవుతారని కూడా 'సాక్షి' ముందే చెప్పింది. వాస్తవానికి సీపీ సత్యనారాయణ బదిలీ ఆకస్మికంగా జరిగిందేమీ కాదు. కుటుంబానికి దూరంగా తానిక్కడ పనిచేయలేకపోతున్నానని, తనను బదిలీ చేయాలని ఆయనే స్వయంగా కోరినట్లు సమాచారం. అదే సమయంలో సత్యనారాయణ ఇక్కడ హుజూరాబాద్ ఉపఎన్నికతోపాటు ఎమ్మెల్సీ జనరల్ ఎలక్షన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు ఏదైనా జిల్లాలో జనరల్ ఎలక్షన్ నిర్వహించినా, రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా.. మరో జనరల్ ఎలక్షన్‌కు ఉండకూడదన్న నియమం కూడా ఉంది. ఎన్నికల సమయంలో ఇబ్బంది కాకుండా ప్రభుత్వం కూడా అయన బదిలీవైపే మొగ్గుచూపింది.



కోరుట్లలో చిన్నారుల అక్షరాభ్యాసం



ధర్మపురి ఆలయంలో పూజలు

ఘనంగా వసంత పంచమి

ధర్మపురి: జిల్లావ్యాప్తంగా గురువారం వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిన్నారులకు అమ్మవార్ల చెంత అక్షరాభ్యాసం చేయించారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా స్వామివారికి పంచోపనిషత్తులతో అభిషేకం, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఇసుకస్తంభం వద్ద స్వామివారి విశ్రాంత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా వసంతం చల్లుకుని తిరిగి ఆలయానికి చేరుకున్నారు. రేనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, వేద పండితులు బొజ్జ రమేశ్ శర్మ, ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, నంబి శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

ష్.. గప్‌చుప్!

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామాపై ఉత్కంఠ
- శ్రావణి వ్యాఖ్యలపై స్పందించని అధిష్టానం

జగిత్యాల: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి రాజీనామా వ్యవహారం మరుసటి రోజు అంతా సైలెంట్ అయ్యింది. శ్రావణి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఈ విషయమే చర్చనీయాంశమైంది. శ్రావణి రాజీనామాపై అధిష్టానం ఇప్పటి వరకు స్పందించలేదు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సైతం స్థానికంగానే ఉన్నా.. ఎవరూ ఈ విషయమై మాట్లాడలేదు. ఎమ్మెల్యే సంజయ్ మాత్రం శ్రావణి వ్యాఖ్యలు బాధ అనిపించాయని పేర్కొన్నారు. అంతే తప్ప ఆమెపై చర్యలు తీసుకుంటున్నారా, ఏం చేస్తున్నారన్నది తెలియడం లేదు. కాగా, కౌన్సిలర్లు మాత్రం శ్రావణి బీజేపీలోకి వెళ్తుందని, అందుకే ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిందని ఆరోపించారు. రాజీనామా చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ జిల్లాకేంద్రంలోని పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పదవికే రాజీనామా చేస్తున్నారా, పార్టీకి కూడానా అని కొందరు అడుగగా.. ప్రస్తుతం పదవికే రాజీనామా చేశానని, పార్టీలో కొనసాగుతానని పేర్కొనడం గమనార్హం. అయితే రాజీనామా చేసిన చైర్‌పర్సన్ బీజేపీలోకి వెళ్తున్నారా లేదా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ బీఆర్ఎస్‌లోనే కొనసాగితే అధిష్టానాన్ని స్పందించాల్సిన ఉంది. అందరూ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బిజీగా ఉండటంతోఎలాంటి నిర్ణయాలు రాలేదని సమాచారం.

అధిష్టానం వైపే చూపు

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామాతో పట్టణంలో రాజకీయం వేడెక్కడంతో ఆమెపై చర్యలు ఉంటాయా లేదా అని అధిష్టానం వైపే అందరి చూపు ఉంది. కౌన్సిలర్లు మాత్రం ఖచ్చితంగా పార్టీ నుంచి బహిష్కరిస్తారని ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని పేర్కొంటున్నారు. మరోవైపు జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి కోసం కొందరు ఇప్పటినుంచే పోటీపడుతున్నారు. గతంలో చైర్‌పర్సన్ పోటీలో ఉన్న బండారు రజిని, సమిండ్ల వాణి మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అంతేకాక పద్మశాలి వర్గానికి చెందిన బోగ శ్రావణి రాజీనామాతో అదేవర్గానికి చెందిన అడువాల జ్యోతికి చైర్‌పర్సన్ పదవి ఇచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం


నాగన్న

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ముత్యపు నాగన్న డాక్టరేట్ పొందారు. ఇన్ ఫ్యాక్ట్ ఆఫ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామింగ్స్ - ఎ స్టడీ ఆఫ్ ఉట్నూర్ ఐటీడీఏ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. గురువారం గణతంత్ర వేడుకల్లో భాగంగా పట్టా అందుకున్న నాగన్నను సర్పంచు నేమూరి లత, ఉప సర్పంచు రాంరెడ్డి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గుడూరి సురేష్, ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపకులు అభినందించి, సన్మానించారు.

తుంగూర్‌లో ఒకరిపై రౌడీషీట్

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన చుక్క గంగాధర్‌పై పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. గంగాధర్ ఇప్పటికే 4 క్రిమినల్ కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న అతనిపై ఉన్నతాధికారులు ఆదేశాలకు రౌడీషీట్ ఓపెన్ చేసి, నిఘా ఉంచినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని అర్పపల్లికి చెందిన రజిత అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రజిత బుధవారం అర్పపల్లి సమీప లక్ష్మీదేవిపల్లిలోని తన చిన్నమ్మ ఇంటికి వెళ్లింది. అదేరోజు రాత్రి 10 గంటలకు తిరిగి అర్పపల్లికి బయలుదేరింది. కానీ ఇంటికి చేరలేదు. బాధితురాలి తండ్రి చంద్రమౌళి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో మ్యాదరవేని సూరవ్వపై కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. భూ తగాదా విషయంలో కొల్వాయికే చెందిన మ్యాదరవేని అంజన్న సూరవ్వను గురువారం అసభ్యపదజాలంతో దూషించాడు. అంతటితో ఆగకుండా కర్రతో ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


వర్షిత్


తిరుమలేశ్

కరీంనగర్‌స్పోర్ట్స్: తమిళనాడులోని తిరుచిరపల్లిలో ఈనెల 26 నుంచి 30 వరకు జరుగనున్న జాతీయ స్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వరరావు, బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 7 నుంచి 9 వరకు మంచిర్యాల జిల్లా మందమర్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన రామడుగుకు చెందిన గుర్రం తిరుమలేశ్, మానకొండూర్ గురుకుల కళాశాలకు చెందిన వర్షిత్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, జనార్దన్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు ప్రభాకర్, సురేందర్, కోచ్ వెంకటేష్ అభినందించారు.


జెడ్పీ సీఈవో రామానుజాచార్యకు ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ రవి, ఎస్పీ సింధూశర్మ


శ్రీధర్, డీఎంహెచ్‌వో


నరేష్, సంక్షేమ అధికారి


డా.సుదక్షిణాదేవి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్


మాధురి, ఆర్డీవో

ఉత్తమ సేవలకు ప్రశంస

జగిత్యాలటౌన్: 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు గురువారం జగిత్యాలలోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ రవి చే తులమీదుగా ప్రశంసాపత్రాలు అందించారు. ఆ యనతోపాటు ఎస్పీ సింధూశర్మ వారిని అభినందించారు.



నరేష్, డీపీవో, రాజశేఖర్‌రాజు, సీఐ, కోరుట్ల


నవీన్‌కుమార్, సీఐ డీపీవో, జగిత్యాల


నయీంఖాన్, హెచ్‌సీ, ఇంటలిజెన్స్


గోపాల్, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్



అశోక్, ప్రిన్సిపాల్, డిగ్రీ కళాశాల


కరుణశ్రీ, పీవో డీసీపీయూ


పూర్ణచందర్, జేపీవో


ప్రణీత, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్


శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్


సంతోష్. మున్సిపల్ కమిషనర్, రాయికల్


మహేశ్వర్‌రెడ్డి, ఎంపీవో, మెట్‌పల్లి

జగిత్యాల ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రం


మాట్లాడుతున్న రామచంద్రం

కరీంనగర్‌కల్చరల్: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణిని ఇబ్బందులకు గురిచేసి తన రాజీనామాకు కారణమైన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై గవర్నర్ చర్య తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన నిషాని రామచంద్రం డిమాండ్ చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ కరీంనగర్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఒక మహిళ చైర్మన్‌ను వేధించడం నీచమైన చర్య అని, ఇది దొరల అహంకారానికి నిదర్శనమన్నారు. గవర్నర్ స్పందించి ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, కరీంనగర్ జోనల్ మహిళా కన్వీనర్ స్వరూప, జిల్లా కార్యదర్శులు బడుగు నరేష్, మంద రవీందర్, టౌన్ అధ్యక్షుడు ఆస్తపురం మధు, అసెంబ్లీ మహిళా కన్వీనర్ అల్లూరి అనురాధ, రామడుగు కుమార్, రోమాల రాజు, స్వామి, మంద బాలయ్య, బండపల్లి శ్రీకాంత్, విష్ణు తదితరులున్నారు.

ఏఎల్పీలో తప్పిన పెను ప్రమాదం


కూలిపోయిన గ్యాలరీ షెడ్

రామగిరి(మంథని): సింగరేణి ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్(ఏఎల్పీ)లో గురువారం వేకువజామున పెను ప్రమాదం తప్పింది. గని ఆవరణలో సర్ఫేస్ చైర్ లిఫ్ట్ సమీపంలోని ఏ2 బెల్ట్ గ్యాలరీ షెడ్ ఒక్కసారిగా కూలిపోయింది. గ్యాలరీ షెడ్ కింది నుంచి నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే గ్యాలరీ షెడ్ కూలిన సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. షెడ్ ఒక్కసారిగా కుప్పకూడంతో బొగ్గు రవాణాకు అంతరాయం కలిగి పెద్దఎత్తున నష్టం వాటిల్లినట్లు కార్మికులు వాపోతున్నారు. బొగ్గు ఉత్పత్తిపైన ఉన్న శ్రద్ధ రక్షణపై చూపించకపోవడం వల్లే గనిలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రక్షణ చర్యలు తీసుకోని సంబంధిత అధికారులపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఏఈపై దురుసుగా ప్రవర్తించిన ఎంపీపీ భర్త


వాటర్ బాటిల్ విసిరేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ముద్దసాని సులోచన భర్త శ్రీనివాస్‌రెడ్డి పంచాయతీరాజ్ ఏఈ తిరుపతిపై దురుసుగా ప్రవర్తించిన ఘటన మండలంలో చర్చనీయాంశమైంది. గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో జెండా ఆవిష్కరణ అనంతరం అధికారులు, నాయకుల మాటామంతి సమయంలో ఏఈతో ఎంపీపీ భర్త మాట్లాడారు. లక్ష్మీపూర్‌లోని వెల్ది ప్రభుత్వాసుపత్రి భవన నిర్మాణ పనుల శంకుస్థాపన విషయమై చర్చించారు. విషయాన్ని దాటవేసే ధోరణిలో ఏఈ సమాధానం ఇవ్వడంతో ఒకింత అసహనానికిలోనైన శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే ఉన్న వాటర్‌బాటిల్‌ను టేబుల్ మీదికి విసరడంతో వాతావరణం వేడెక్కింది. దీంతో ఏఈ పక్క గదిలోకి వెళ్లి కంటతడి పెట్టుకున్నారు. అధికారులు, నాయకులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

యువకుడి అనుమానాస్పద మృతి


కొమ్మ రాజు(ఫైల్)


ఘటన స్థలంలో రాజు మృతదేహం

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన కొమ్మ రాజు(24)బుధవారం రాత్రి కాచాపూర్ నుంచి వడ్కాపూర్ వెళ్లే దారి పక్కన అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తండ్రి కొమ్మ రాజేశం, పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు రాజు తన పల్సర్ బైక్ బయటకు వెళ్లి ఎంతకు తిరిగిరాలేదు. దీంతో రాజు తమ్ముడు సతీష్, తండ్రితో కలిసి వెదుకుతుండగా, కాచాపూర్ పెట్రోల్ బంకు సమీపంలో బైక్ పక్కన మృతిచెంది ఉన్నాడు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు తండ్రి పేర్కొన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

జెండావిష్కరణలో నిబంధనల ఉల్లంఘన


బడిలో మధ్యాహ్నం కనిపించని జెండా

కోనరావుపేట(వేములవాడ): మర్తనపేట ప్రాథమిక పాఠశాలలో జెండావిష్కరణలో నిబంధనలు ఉల్లంఘించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉదయం ఎగురవేసిన జెండాను సాయంత్రం 6 గంటల వరకు తీయకూడదు. కానీ పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకే తొలగించి, వెళ్లిపోయారు. సీఆర్పీ రాజేశ్వర్‌రావు, ఎంఈవో రఘుపతిలను వివరణ కోరగా సాయంత్రం వేళలో మాత్రమే తీయాలని, అంతకుముందు తొలగించరాదని తెలిపారు.

ఏఎల్పీలో కార్మికుడికి కరెంట్ షాక్


రామకృష్ణను పరామర్శిస్తున్న నాయకులు

రామగిరి(మంథని): సింగరేణి ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్(ఏఎల్పీ)లో గురువారం వై.రామకృష్ణ అనే ఎలక్ట్రీషియన్ విదుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానిక కార్మికుల వివరాల ప్రకారం.. గనిలోని 89వ లెవల్‌లో స్విచ్ వద్ద విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు షాక్ తగలడంతో రామకృష్ణ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి రామకృష్ణను పరిశీలించగా అపస్మారక స్థితిలో ఉన్నాడు. హుటాహుటిన గనిపైకి తీసుకువచ్చి సెంటినరీకాలనీలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. ప్రథమ చికిత్స పొందిన రామకృష్ణ స్పృహలోకి వచ్చాడు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణను టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, ఏఎల్పీ ఫిట్ సెక్రటరీ దాసరి మల్లేశ్ పరామర్శించారు.

హరితస్ఫూర్తి పురస్కారానికి రమేశ్ ఎంపిక



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన దుంపెన రమేశ్ పర్యావరణ పరిరక్షణ హరితస్ఫూర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. హుస్నాబాద్‌కు చెందిన యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29న పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య


మమత మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన వివాహిత ఎలగందుల మమత(29) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేటకు చెందిన ఎలగందుల లక్ష్మీ-నర్సయ్యలకు ముగ్గురు కూతుళ్లు. వారి రెండో కుమార్తె ఎలగందుల మమత(29) వివాహం 2014లో దుబ్బాక మండలానికి చెందిన వ్యక్తితో జరిగింది. కాగా అతనితో విడాకులు అయ్యాయి. మళ్లీ పెళ్లి చేయడానికి సంబంధాలు చూస్తున్నప్పటికీ ఆమెకు నచ్చడం లేదు. విడాకుల విషయం తలుచుకుంటూ తరచూ బాధపడుతుండేది. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎల్లారెడ్డిపేట ఎస్సై శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డలో పేకాట స్థావరంపై ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి దాడి చేయగా.. ఐదుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.8,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నిందితులను చందుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చేతబడి అనుమానంతో చంపేశారు..

- మల్లాపూర్ వృద్ధుడి హత్య కేసులో ముగ్గురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రానికి చెందిన నూతికట్టు గంగారాం(62)ను చేతబడి చేస్తున్నాడన్న అనుమానంతో హత్య చేశారని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ముగ్గురు నేరస్తులను అరెస్టు చేశామన్నారు. గురువారం మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మల్లాపూర్‌కు చెందిన పిల్లి సత్యనారాయణ, ముద్దం నరేష్‌లు కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రి పాలుకావడం, కుటుంబాల్లో అనేక సమస్యలకు గంగారాం చేతబడి చేయడమే కారణమని వారు అనుమానించారు. అతన్ని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం ఈ నెల 16న అర్ధరాత్రి ఎల్లాల గోవర్ధన్‌తో కలిసి గంగారాం గొంతునులిమారు. చనిపోయాడని భావించి, బైక్‌పై గ్రామ శివారులోని కోపిగుట్ట వద్దకు తీసుకెళ్లారు. ఆ సమయంలో వృద్ధుడిలో కదలికను గమనించి, పెద్ద బండరాయితో ముఖంపై మోది, హత్య చేశారు. మృతదేహాన్ని ఉపాధిహామీ గుంతలో పూడ్చిపెట్టారు. పైపైన పూడ్చడంతో ఆ మృతదేహాన్ని ఈ నెల 21న అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించారు. వీఆర్ఏ ఎస్సై నవీన్‌కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి, పరిశీలించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు మృతదేహాన్ని బయటకు తీయగా గంగారాందేనని అతని తమ్ముడి కుమారుడు రవి గుర్తించాడు. హత్యకు గురైనట్లు తేల్చిన పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ముగ్గురు అనుమానితులు సత్యనారాయణ, నరేష్, గోవర్ధన్‌లను అదుపులోకి తీసుకొని, విచారణ జరుపగా తామే హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. దృశ్యం సినిమాలో మాదిరిగా వృద్ధుడి గంగారాం దుస్తులను నరేష్ తన ఇంటి వెనకాల కాల్చివేశామన్నారు. ఫోన్‌ను మెట్‌పల్లి బస్టాండ్‌లో నిజామాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులో పడేశామని, తర్వాత తిరిగి మల్లాపూర్ వచ్చినట్లు పేర్కొన్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి, హత్యకు వినియోగించిన ద్విచక్రవాహనం, బండరాయి, పారను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కాకతీయ కాలువలో యువకుడి మృతదేహం

- ఈ నెల 23న ప్రమాదవశాత్తు పడి మృతి
- ఉపాధి పనులపై సోషల్ ఆడిట్‌కు వీఆర్‌పీగా వచ్చిన రామకృష్ణాపూర్‌వాసి


సాయికుమార్ (ఫైల్)


మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ చేసేందుకు వీఆర్‌పీగా వచ్చిన మామిడి సాయికుమార్(21) ప్రమాదవశాత్తు కాలువలో పడి, మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కొడిమ్యాల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన సాయికుమార్ ఈ నెల 21న ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి, సోషల్ ఆడిట్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 23న మండల పరిషత్ కార్యాలయం వెనక వైపు కాకతీయ కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. సాయికుమార్‌తో సోషల్ ఆడిట్‌కు వచ్చినవారు అతను కనిపించడం లేదని చుట్టుపక్కల వెతికారు. సాయికుమార్ తండ్రి నారాయణగౌడ్‌కు ఫోన్ చేస్తే ఇంటికి కూడా రాలేదని సమాధానం ఇచ్చారు. దీంతో ఉపాధిహామీ ఎస్ఆర్ మహేశ్వర్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం తాటిపెల్లి వద్ద కాలువలో సాయికుమార్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి నారాయణ గౌడ్‌కు ఇద్దరు కుమారులు కాగా సాయికుమార్ పెద్ద కొడుకు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

మృతదేహంతో ఆందోళన

జగిత్యాల క్రైం: సాయికుమార్ మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అతని కుటుంబసభ్యులు అప్పగించారు. దీంతో వారు మృతదేహాన్ని జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల కరీంనగర్ రహదారిపై ఉంచి, ఆందోళన చేపట్టారు. బాధితులకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జగిత్యాల పట్టణ ఎస్సై రహీం, ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమాసాగర్‌లు బాధితులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించి, సాయికుమార్ మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా




జరిమానా చలానా చూపిస్తున్న అధికారులు

సుల్తానాబాద్/ఓదెల(పెద్దపల్లి): ఎక్సైజ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ శ్యాముల్ ఆనంద్‌రావు హెచ్చరించారు. ఓదెల గ్రామానికి చెందిన క్యాతం రమేష్ గుడుంబా, నాటు సారా అమ్మవద్దని గతంలో బైండోవర్ చేశామని, నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.లక్ష జరిమానా విధించడం జరిగిందన్నారు. గుడుంబా తయారీ, విక్రయాలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ప్రమాదమా.. ఆత్మహత్యా..?

- రైలు ఇంజిన్ ముందు భాగంలో చిక్కుకున్న వృద్ధుడి మృతదేహం
- కాజీపేట నుంచి జమ్మికుంటకు చేరిన వైనం
- జమ్మికుంట రైల్వే స్టేషన్ వద్ద తొలగింపు


కాగితంపై నా చావుకు నేనే కారణం అని రాసి ఉన్న దృశ్యం


రైలు ఇంజిన్ ముందు భాగంలో మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదమో లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడో తెలియదు గానీ.. ఓ వృద్ధుడు రైలు ఇంజిన్ ముందు భాగంలో చిక్కుకోగా, అతడి మృతదేహం కాజీపేట నుంచి జమ్మికుంటకు వచ్చే వరకు అలాగే ఉంది. వరంగల్, ఉప్పల్ రైల్వే స్టేషన్ మధ్య వేరే రైలు లోకో పైలెట్ గుర్తించి జమ్మికుంట రైల్వే మేనేజర్‌కు సమాచారం అందించారు. జమ్మికుంటలో రైలును నిలిపివేసి రెండు గంటలపాటు శ్రమించి మృతదేహాన్ని తొలగించారు. స్థానికులు, మృతదేహాన్ని తొలగించినవారు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా కేంద్రం నయీమ్‌నగర్‌కు చెందిన మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగి ఉప్పలయ్య (70) ప్రమాదమో లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడో తెలియదుగాని అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలు కాజీపేట నుంచి వస్తుండగా ఎస్ క్యాబిన్ వద్ద రైలు ముందుభాగంలో చిక్కుకొని మృతిచెందాడు. జమ్మికుంట వచ్చే వరకు (సుమారు 36 కిలో మీటర్లు) మృతదేహం అలాగే ఉండిపోయింది. జమ్మికుంటలో మృతదేహాన్ని తొలగించి అతడి వద్ద ఉన్న ఆధార్ కార్డు జిరాక్స్‌తో వివరాలు గుర్తించారు. అయితే ఆధార్ కార్డు జిరాక్స్ పేపర్ వెనుక భాగంలో నా చావుకు ఎవరూ కారణం కాదు అని రాసి ఉంది. మృతుడికి భార్య ఉపేంద్ర, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతిని అడుగగా, జరిగిన విషయం తెలిసిందని, సంఘటన స్థలానికి వస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


చాంద్‌పాషా మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహినికుంటకు చెందిన మహ్మద్ చాంద్‌పాషా గురువారం ప్రాణాలు వదిలారు. చాంద్‌పాషా(52) ఈనెల 17న కూలీ పనులకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలైన చాంద్‌పాషా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. పది రోజులపాటు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య జుబేదా, కుమారులు షాదుల్, షారుక్ ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.